సమాచారం

డ్రైనేజీ పనులు ప్రారంభం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో రూ.10లక్షల నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పనులను కౌన్సిలర్ జి.అరుణజ్యోతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అంతర్గత డ్రైనేజీ సామర్థ్యం పెంచుతున్నామన్నారు.

11,12 తేదీల్లో క్రికెట్ టోర్నమెంట్



మున్సిపల్ కమిషనర్‌కు లెటర్ ప్యాడ్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 11,12వ తేదీల్లో రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మైదానంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు రాపర్తి రాకేష్‌గౌడ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వేము వందనంకు ‘విశిష్ట సేవా పురస్కారం’



పురస్కారం అందుకుంటున్న వేము వందనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రేమావతిపేటకు చెందిన వేము వందనంకు తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం–2023 అవార్డు వచ్చింది. నాటక రంగంలో చేసిన కృషికి గాను పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను అందజేశారు. నల్గొండ జిల్లా చిట్యాలలో పుడమి సాహితీ వేదిక 4వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారాలు అందించారు.

క్రైం కార్నర్..

గంజాయి విక్రయాలను అరికట్టండి

- పోలీసులకు కిస్మత్‌పూర్‌వాసుల వినతి

రాజేంద్రనగర్: గంజాయి విక్రయదారుల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కిస్మత్‌పూర్ వాసులు కోరుతున్నారు. హుక్కా పేరున గంజాయి ఇస్తు పిల్లల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి బండ్లగూడ వద్ద పాన్‌షాప్‌లో హుక్కా పేరిట గంజాయిని సరఫరా చేస్తున్న యువకుడిని పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. గత మూడు రోజుల క్రితం టైమ్స్ స్కూల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసింది. కిస్మత్‌పూర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో పని చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి పనులు చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, అస్సాం, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. అక్కడ గంజాయికి అలవాటు పడ్డ వారు వివిధ మార్గాల ద్వారా గంజాయిని కొనుగోలు చేసి తాగుతున్నారు. ఈ గంజాయిని కొందరు సిగరేట్ల రూపంలో విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి స్థానికంగా ఉన్న యువకులు, పెద్దలు సైతం అలవాటు పడుతున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న యువకులు మధ్యాహ్నం, రాత్రి సమయంలో బండ్లగూడలోని పాన్ షాపు వద్దకు వెళ్లి గంజాయి తాగుతుండగా స్థానికులు పట్టుకోని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పాన్‌షాపులతో పాటు హుక్కా సెంటర్లపై పోలీసుల నిఘా లేకపోవడంతో గంజాయి దందా జోరుగా సాగుతుంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్‌వే.. డ్రింకింగ్ జోన్

- రోడ్డుపై మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నా పట్టించుకోని వైనం
- నిర్వహణ బాధ్యతలు మారాక లోపించిన పర్యవేక్షణ



ఎక్స్‌ప్రెస్‌వే పై మద్యం బాటిళ్లు

రాజేంద్రనగర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే బర్త్‌డే పార్టీలు, తాగుబోతులకు అడ్డాగా మారింది. ఎక్స్‌ప్రెస్ వేపై పోలీసుల నిఘా లేకపోవడంతో అర్ధరాత్రి తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్‌వే నిర్వహణ హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ నుంచి సీఆర్‌ఎంపీ సంస్థకు అప్పజెప్పారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి మెహదీపట్నం సరోజినీ దేవి ఆస్పత్రి వరకు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించారు. ఆసియాలోనే అతి పెద్ద వంతెనగా రికార్డులో ఎక్కింది. సీఆర్‌ఎంపీ సంస్థకు వచ్చాక ఎక్స్‌ప్రెస్‌వేపై చెత్తచెదారం దర్శనమిస్తోంది. గతంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్డను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేవారు. ప్రస్తుతం ఈ రహదారి చెత్తచెదారాలు, మద్యం బాటిళ్లు, ప్రమాద సమయంలో విరిగిపడ్డ వాహనాల పరికరాలతో దర్శమిస్తోంది.నిర్వహణ బాధ్యతలు మారాక పర్యవేక్షణ లేకుండా పోయింది.

బర్త్‌డే పార్టీలు...

ఎక్స్‌ప్రెస్‌వేపై కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు తదితర వాటికి అనుమతి లేదు. కొందరు ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై బర్త్‌డే , మద్యం పార్టీలు చేసుకుంటున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే 11 కిలోమీటర్లు ఉండడంతో ఎక్కేందుకు, దిగేందుకు సబ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి సమయంలో ఈ సబ్ బ్రిడ్జిల పక్కన వాహనాలను నిలువుతూ మద్యం తాగి బాటిళ్లను రోడ్డుపై పడేస్తున్నారు. మరికొందరు రాత్రి సమయం హల్‌చల్ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి...

ఎయిర్‌పోర్టుకు వీఐపీల రాక సమయంలో ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై పోలీసులు హంగామా చేసి అనంతరం పట్టించుకోవడం లేదు. వీఐపీల రాకపోకల సమయంలో లాఅండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఉంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై పోలీసు నిఘాను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



జేఎన్‌ఆర్‌యూఎంలో రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బండ్లగూడ: ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ 15వ రోజు 1వ డివిజన్‌లోని ఫీల్ గుడ్ హోమ్స్, జేఎన్‌ఆర్‌యూఎన్‌ఎం ఫేస్–1,2,3, ఇంద్రానగర్ కాలనీ, తిరుమల హిల్స్ కెకె–4, శ్రీనివాసనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, కె.కె.2 గేట్1,2, రంగారెడ్డి కాలనీ గణేష్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, బృందావన్ కాలనీ, విష్ణుపురి కాలనీ, విద్యానగర్, వాల్మీకినగర్, విజయ్ విహార్, శివసాయి ఫేస్–1,2, పార్కు, సుబ్రహ్మణ్యం ఫేజ్–1,2,3, పిఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ, వెంకటేష్, గిరి, శ్రీధర్, నవీన్, మీర్జా తౌపిక్, లక్ష్మీనారాయణ, జగన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భవన నిర్మాణ సామగ్రి తరలింపు



రక్షణ ఏర్పాట్లు లేకుండా వెళ్తున్న లారీ

బండ్లగూడ: భవన నిర్మాణ సామాగ్రిని లారీలలో ప్రమాదభరితంగా తరలిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాల కోసం ఇసుక, కంకర తదితర భవన నిర్మాణ సామాగ్రిని లారీలలో తరలిస్తుంటారు. లారీలపై ఎలాంటి కవర్లు, జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో గాలికి వ్యర్థాలు రోడ్లపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులపై పడుతున్నాయని ఆ సమయంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారుల కంటిలో వ్యర్థాలు పడడంతో వారు కిందపడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాగ్రత్తలు పాటించని లారీలపై చలాన్‌లు విధించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ సంగీత తదితరులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ అభివృద్దే లక్ష్యంగా పలు పనులు చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. రతన్‌నగర్‌లో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు పనులు, తేజస్వినగర్ కాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు పనులు, టీకేఆర్ నగర్‌లో మంచినీటి పైపులైన్ పనులకు ఆయన అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొంద్ర కొమురయ్య, రాజశేఖర్, వెంకటేష్, రాజు, రావుల జగన్, సురేందర్‌రెడ్డి, కె.సుభాష్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సగరుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీని కలిసిన అంజయ్యనగర్ సగర సంఘం సభ్యులు

గచ్చిబౌలి: సగరుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం అంజయ్యనగర్ సగర సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజయ్యనగర్ అభివృద్ధి కోసం సగరులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజయ్యనగర్ సగర సంఘం అధ్యక్షులు నర్సింహ్మ సాగర్, ప్రధాన కార్యదర్శి గడ్డపార రవి సాగర్, కోశాధికారి రవి సాగర్, చంద్రమోహన్ సాగర్, రాజు సాగర్, సత్యనారాయణ సాగర్, మహిళ నాయకురాళ్లు కృష్ణ కుమారి, విమల, రేణుక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ వై.కృష్ణ, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్‌నాయక్, పాఠశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘108’ ఉద్యోగాలకు 11,12 తేదీల్లో ఇంటర్వ్యూలు

శంషాబాద్: 108 అంబులెన్స్‌లో పైలట్ (డ్రైవర్) ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాలకు ఔత్సాహికులైన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నారు. పైలట్ ఉద్యోగానికి కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎల్‌ఎంవీ (బ్యాడ్జి) కలిగి ఉండాలి 23–35 సంవత్సరాల లోపు వయసు ఉండాలి, అదే విధంగా ఈఎంటీ ఉద్యోగానికి బీఎస్సీ లైఫ్‌సైన్స్, ఎంఎల్‌టీ, డీఎల్‌టీ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ నెల 11, 12 తేదీల్లో హయత్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో పాటు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు.

బాలకార్మికులకు విముక్తి

శంషాబాద్: పట్టణంలోని రెండు వేర్వేరు మద్యం దుకాణాల్లో పనిచేస్తోన్న బాలకార్మికులకు స్మైల్ టీం సభ్యులు విముక్తి కల్పించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్మైల్‌టీం, పోలీసులు జరిపిన తనిఖీల్లో జాతీయరహదారి పక్కన ఉన్న ఉజ్వల వైన్స్‌లో పనిచేస్తోన్న ఓ బాలకార్మికుడితో పాటు రాళ్లగూడ రహదారిలో అను వైన్స్‌లో పనిచేస్తున్న బాల కార్మికుడిని గుర్తించారు. బాల కార్మికులతో పనిచేయించుకుంటున్న రెండు మద్యం దుకాణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలకార్మికులను బాలసదన్ కేంద్రాలకు తరలించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఉద్యోగ ప్రకటన

- యువకుడి నుంచి రూ.15,620 స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

శంషాబాద్ రూరల్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఉద్యోగ ప్రకటన చూసి మోసపోయిన ఓ యువకుడు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని గొల్లపల్లికి చెందిన నాగవజ్రం ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 6న మధ్యాహ్నం మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. అందులో పెన్సిల్ ప్యాకింగ్ ఉద్యోగం పేరుతో ఓ ప్రకటన కనిపించింది. దీంతో ఉద్యోగం కోసం అందులో కనిపించిన ఫోన్ నంబర్‌తో మాట్లాడగా.. ఐడీ కార్డు కోసం రూ.650 చెల్లించమనడంతో ఫోన్‌పే ద్వారా పంపించాడు. పలు సార్లు రకరకాలుగా చార్జీల పేరుతో మొత్తం రూ.15,620 ఫోన్‌పేతో చెల్లించాడు. తర్వాత అవతలి వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సోమవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనూలో ఫౌండేషన్ డే లెక్చర్

రాయదుర్గం: ‘మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం’ అనేది జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రధాన ఉర్దూ సంబంధిత సంస్థగా గుర్తింపు తెచ్చుకుందని మాజీ వీసీ ప్రొఫెసర్ ఏఎం పఠాన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీలోని డీడీఈ ఆడిటోరియంలో ‘మనూ’ 26వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫౌండేషన్ ఉపన్యాస కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా...

- జాగ్రత్తలు తప్పనిసరి
- నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్



మణికొండ: సంక్రాంతి పండగ నేపథ్యంలో చాలామంది తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ తరుణంలో పలు జాగ్రత్తలు పాటించడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ నగరం నుంచి గ్రామాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే పలు రోడ్లు, కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో వాటి ద్వారా పోలీస్‌స్టేషన్‌ల నుంచే పర్యవేక్షిస్తామన్నారు. అలాగే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

- కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఊరికి వెళ్లే వారు తమ ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి చెప్పాలి.
- విలువైన వస్తువులను బైక్‌లు, కార్లలో పెట్టవద్దని, వాటిని రోడ్లపై కాకుండా ఇంటి ఆవరణలోనే పార్కు చేయాలి. హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్‌లు వేయాలి.
- బీరువా తాళం చెవిలను ఇంట్లో ఉంచకుండా తమతో పాటే తీసుకెళ్లాలి. పాలు, పేపర్ వేయొద్దని చెప్పాలి. పనిమనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి.
- ఇంటికి తాళం వేసి కర్టెన్ వేయడంతో పాటు ఇంట్లో లైటు వేసి ఉంచాలి. వీలుంటే టైమర్‌తో కూడిన లైట్లను అమర్చుకోవాలి.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. బంగారం, నగదును లాకర్‌లలో భద్రపర్చుకోవాలి.
- తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌లను పోలీస్‌స్టేషన్‌లో తెలపాలి. అలాంటి చోట్ల గస్తీ పెంచుతాం. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల ముందుకు ఎవరైనా కొత్త వారు వస్తే వారి వివరాలను వాచ్‌మెన్‌లు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చేలా చూడాలి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులనే నియమించుకోవాలి. వారి పూర్తి వివరాలను తీసుకోవాలి.
- సీసీ కెమెరాలు ఉన్నవారు తమ సెల్ ఫోన్‌లలో అపుడపుడు ఇంటి పరిసరాలను చూసుకోవాలని సూచించారు.

మన సంస్కృతిని చాటాలి



మణికొండలో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మన తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలను చాటడంతో పాటు భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, కృషి ఫౌండేషన్ అధ్యక్షురాలు పి.రూపారెడ్డి ఆధ్వర్యంలో మణికొండ మల్లన్న ఆలయం రోడ్డులో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో మొదటి స్థానం శ్రీదేవి రూ. 5వేలు, ద్వితీయ స్థానం విజయలక్ష్మి రూ.3వేలు, తృతీయ స్థానం శిరీషకు రూ. 2వేల నగదు బహుమతులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, నాయకులు జయరాజ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణ పనుల పరిశీలన



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ ప్రేమ్‌రాజ్ తదితరులు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో శంషాబాద్ ఫ్లైఓవర్ డిజైన్‌లో మార్పులు జరిగాయని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ ప్రేమ్‌రాజ్ ఆరోపించారు. పట్టణంలోని సిద్ధాంతి హనుమాన్ ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు జరుగుతున్న హైవే విస్తరణ పనులను సోమవారం బీజేపీ నేతలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇరవై ఏళ్ల కిందటే జాతీయ రహదారి విస్తరణలో ఓ ప్రార్థనామందిరానికి ప్రత్యామ్నాయ స్థలంతో పాటు కేంద్ర సర్కారు హైవే అథారిటీ నష్టపరిహారం చెల్లించింది. అయినప్పటికి విస్తరణ స్థలంలో ఉన్న కట్టడాలను తొలగించకుండా ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో ప్రధాన సమస్యను పరిష్కరించని అధికారులు ఫ్లైఓవర్ డిజైన్‌తో పాటు విస్తరణలో అనేక లోపాలతో పనులు చేపడుతున్నారన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు దేవేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ప్రశాంత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

మండల వైద్యాధికారి పద్మ



మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి పద్మ

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వ తేదీ నుంచి జూన్ 23 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ అన్నారు. సోమవారం మణికొండలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వార్డులోను కంటి పరీక్షల కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, అందులో 18 సంవత్సరాల వయసు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 18వ తేదీన రెండవ వార్డు చిత్రపురి కాలనీలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మేనేజర్ మల్లారెడ్డి, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో..

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం కంటివెలుగు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.కార్పొరేటర్ అర్చన, డీసీ జగన్, ప్రాజెక్టు ఆఫీసర్ రాధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జయమ్మ సూచించారు. సోమవారం ఈ కార్యక్రమంపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలం, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



ఒరేషన్ లెక్చర్ అవార్డును స్వీకరిస్తున్న హెచ్‌సీయూ ప్రొ. శివకుమార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. 2023 సంవత్సరానికిగాను 27వ ట్రెండీస్ ఇన్ బయోకెమిస్ట్రీ ఒరేషన్ లెక్చర్ అవార్డుకు హెచ్‌సీయూ ప్రొఫెసర్ నడింపల్లి శివకుమార్ ఎంపికయ్యారు. శివకుమార్ హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్‌గా ఉన్నారు. ఈ అవార్డును ఇటీవల మైసూర్‌లోని జేఎస్‌ఎస్‌ఎస్ టెక్నికల్ యూనివర్సిటీలో ఆయన అందుకున్నారు. ట్రెండీస్ అనేది భారతదేశంలోని ఒక శాస్త్రీయ వేదిక. ఇది పరిశోధనా రంగంలో అత్యుత్తమ సహకారాన్ని అందించిన, జాతీయంగా, అంతర్జాతీయంగా తమ విద్యా ప్రయత్నాలలో నైపుణ్యాన్ని నిరూపించుకున్న ఫ్యాకల్టీలను గుర్తించి ఈ అవార్డును అందిస్తుంది.

ముగ్ధ మనోహరం..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి మాధురి నెల్వగల్ నృత్యాంజలి, పుష్పాంజలి, గణేశశ్లోక, కౌత్వం, అష్టపది అంశాలను ప్రదర్శించి అలరించింది. చిన్మయి నృత్య గురువు శ్రీదేవి ముంగర శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. కళాకారులు జాహ్నవి, రిగదా, శ్రావ్య, సాయినిత్య, అన్వి సంకేత, తన్వి రాజస, జాన్వీ కళాకారులు వాణీపరాకు, గణేశా పంచరత్న, కృష్ణశబ్దం, చరిష్ణు, అయిగిరి నందిని మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

